ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

❖ ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ మధ్య నూతన వారాంతపు రైలు సర్వీసును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో కలిసి ప్రారంభించారు.

❖ రాష్ట్రంలోని 87 పట్టణ స్థానిక సంస్థలకు నిర్వహించిన పరోక్ష ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

❖ భారతదేశ తూర్పు తీరానికి విశాఖపట్నం ఒక మణిహారమని కేంద్ర సహాయ మంత్రి పబిత్ర మార్గరీటా అభివర్ణించారు.

❖ భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

==========

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ మధ్య నూతన వారాంతపు రైలు సర్వీసును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షాతో కలిసి న్యూఢిల్లీ నుంచి ఈరోజు వర్చువల్ గా ప్రారంభించారు. భారతీయ రైల్వే ప్రవేశపెట్టిన ఈ రైలు సర్వీసుకు 'సరయూ-కమలా ఎక్స్‌ప్రెస్' అని నామకరణం చేశారు. రామాయణ సంప్రదాయంతో విడదీయలేని అనుబంధం కలిగిన రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఈ రైలు సేవ కీలకమైన రవాణా అనుసంధానాన్ని ఏర్పాటు చేయనుంది. సీతామాత జన్మస్థలంగా పూజలందుకుంటున్న జనక్‌పూర్ ధామ్‌ను, శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యను ఈ రైలు అనుసంధానించనుంది. ఇక భారత్ లో పర్యటిస్తున్న నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షాతో నరేంద్ర మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో రైలు, రోడ్డు కనెక్టివిటీ వంటి ప్రాజెక్టులకు సంబంధించి పలు ఒప్పందాలు చేసుకున్నట్లు ఇరువురు నాయకులు ప్రకటించారు. నేపాల్‌లో అభివృద్ధి పనులకు భారత్ 24 వేల కోట్ల రూపాయల సహాయం అందించనుందని, ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు బలపేతమే లక్ష్యంగా భారత్ - నేపాల్ భాగస్వామ్యంతో చేపట్టే అనేక ప్రాజెక్టులపై చర్చించామని నరేంద్రమోదీ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో నిర్వహించిన పరోక్ష ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు గానూ.. ఇప్పటివరకు 87 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. మిగిలిన 13 పట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికలు రేపు నిర్వహిస్తామని తెలియజేశారు. పూర్తయిన 87 పట్టణ స్థానిక సంస్థల్లో తెలుగుదేశం పార్టీ నుండి 57 మంది, జనసేన పార్టీ నుండి 19, భారతీయ జనతా పార్టీ నుండి 8, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ఇద్దరు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు విజయాలు సాధించారని ఆయన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

==========

భారతదేశ తూర్పు తీరానికి విశాఖపట్నం ఒక మణిహారమని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి పబిత్ర మ్యార్గరీటా అభివర్ణించారు. విశాఖలో ఈరోజు ప్రారంభమైన ఆసియాన్-భారత్ మ్యారిటైం కాన్క్లేవ్ లో పాల్గొన్న ఆయన.. భారత్‌కు, ఆసియాన్‌లోని 11 సభ్య దేశాలకు మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను ప్రస్తావించారు. బంగాళాఖాతం ఈ ప్రాంతంలోని దేశాలను అనుసంధానించే కీలక వారధిగా నిలుస్తోందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. భారతదేశ ఇండో-పసిఫిక్ దార్శనికత, యాక్ట్ ఈస్ట్ పాలసీలో భారత్-ఆసియాన్ సహకారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

అదే విధంగా భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ మాట్లాడుతూ.. భౌగోళిక రాజకీయ పరిణామాలు, వాతావరణ మార్పులు, తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అనిశ్చితి పెరుగుతోందని హెచ్చరించారు. సురక్షిత సముద్ర వాణిజ్య మార్గాలను నిర్ధారించేందుకు ప్రాంతీయ దేశాలన్నీ ఉమ్మడి బాధ్యతతో సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==========

రాష్ట్ర రాజధాని అమరావతిలో థాయ్ సాంస్కృతిక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని థాయ్‌లాండ్ రాయబారి చవనార్ట్ థాంగుసుమ్ ఫంట్‌ను ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ కోరారు. విశాఖలో ఆమెతో ఈరోజు సమావేశమైన మంత్రి లోకేశ్.. రాష్ట్రంలో బౌద్ధ వారసత్వ ప్రాంతాల అభివృద్ధికి థాయ్‌లాండ్ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. బోధ్‌గయ తరహాలో ప్రత్యేక బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. అమరావతిలోని మహాచైత్య స్థూపాన్ని ప్రధాన కేంద్రంగా చేసుకుని నాగార్జునకొండ, తొట్లకొండ, బావికొండలను అనుసంధానించాలని సూచించారు. థాయ్ మ్యూజియంలు, సాంస్కృతిక సంస్థలతో అమరావతి కేంద్రాన్ని అనుసంధానించాలని కోరారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బౌద్ధ అధ్యయన కేంద్రం ఏర్పాటులో థాయ్ యూనివర్సిటీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విశాఖ-థాయ్‌లాండ్ మధ్య క్రూయిజ్, తీరప్రాంత పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ప్రతిపాదించారు.

==========

రాష్ట్రంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ఈ సాయంత్రంతో ముగిసింది. రేపు నామినేషన్ల పరిశీలన జరగనుందని, ఉపసంహరణకు ఈనెల 27 తుది గడువు కాగా డిసెంబర్ 2న పోలింగ్

నిర్వహించి.. అదే రోజున ఫలితాలను ప్రకటిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందిన నివేదికల ప్రకారం.. మూడో విడతలో ఎన్నికలు నిర్వహించనున్న 25 జిల్లాల్లోని 214 మండలాల పరిధిలో 4 వేల 244 గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయగా, మొదటి రెండు రోజుల్లో సర్పంచ్ పదవులకు మొత్తం 16 వేల 505 నామినేషన్లు, వార్డు సభ్యుల పదవులకు 60 వేల 420 నామినేషన్లు దాఖలయ్యాయని ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

==========

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజయవాడ నుంచి ఈరోజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, ఈఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో గుర్తించిన గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన డూప్లికేట్ ఓటర్ల వివరాలపై సమీక్ష నిర్వహించారు. గతంలో ఏఎస్‌డీగా గుర్తించి జాబితా నుంచి తొలగించిన ఓటర్లకు మరొక అవకాశం కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, పునఃస్వీకరణ, పరిశీలనను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను ఈ నెల 30వ తేదీలోగా ఓటర్లకు పంపిణీ చేయడంతో పాటు.. ఓటర్ల నుంచి స్వీకరించిన ఫారాలను డిసెంబర్ 10వ తేదీలోగా పరిశీలించాలని ఆదేశించారు.

==========

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య వెల్లింగ్టన్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 9 వికెట్ల నష్టానికి 720 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 5 వికెట్ల నష్టానికి 239 పరుగులు చేసింది. చివరి రోజు ఆటను రెండు వికెట్ల నష్టానికి 119 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ప్రారంభించిన న్యూజిలాండ్.. నిలకడగా ఆడుతున్న డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర వికెట్లను కోల్పోయింది. అయితే డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ అద్భుతమైన భాగస్వామ్యంతో 43 ఓవర్ల పాటు తమ వికెట్లను కాపాడుకున్నారు. దీంతో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో మొత్తం 120 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి, తొలి టెస్ట్ మ్యాచ్‌ను డ్రాగా ముగించుకుంది. భారత్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ 2 వికెట్లు తీయగా జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ తీశారు. మొదటి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన హెన్రీ నికోల్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ వరించింది. రెండో టెస్ట్ క్రికెట్ మ్యాచ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది.

==========
==========